# బదిలీల గుబులు!

**ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇద్దరు ఐపీఎస్‌ల బదిలీ**

**ఏండ్ల తరబడి ఒకే చోట పనిచేసిన అధికారుల బదిలీకి రంగం సిద్ధం**

**సిద్దిపేట జిల్లా అధికారుల రివ్యూలో ఆరా తీసిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**ఏ నలుగురు అధికారులు కలిసినా బదిలీలపై చర్చ**



సిద్దిపేట, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతున్నది. ఏండ్ల తరబడి ఒకే దగ్గర పనిచేసిన జిల్లా, మండల స్థాయి అధికారుల బదిలీలు తప్పవనే చర్చ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా జోరుగా వినిపిస్తున్నది. ఏ నలుగురు అధికారులు కలిసినా ఇదే అంశంపై మాట్లాడుకుంటున్నారు. దీంతో జిల్లా అధికారుల్లో బదిలీల గుబులు పట్టుకుంది. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతను హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా, మెదక్ జిల్లా ఎస్పీ రోహిణిని హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీగా రెండు రోజుల కిందట బదిలీ చేసిన విషయం తెలిసిందే. జిల్లాల కలెక్టర్లు సైతం బదిలీ అవుతారన్న చర్చ సైతం జరుగుతున్నది. వీరితో పాటు జిల్లాలోని ప్రధాన శాఖల హెచ్‌వోడీలు బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు నచ్చిన అధికారులను తెచ్చుకునే పనిలో నేతలు ఉన్నారు. తాము చెప్పింది చేసే అధికారి ఉండాలని అధికార పార్టీ నేతలు కోరుకుంటున్నారు. ఏ అధికారి ఎన్ని ఏండ్ల నుంచి పని చేస్తున్నారు. ఎవరెవరు ఎక్కడ పని చేస్తున్నారు అని సిద్దిపేట జిల్లా స్థాయి అధికారుల రివ్యూ మీటింగ్‌లోనే ఇటీవల జిల్లాకు చెందిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. దీంతో ఆయా విభాగాల హెచ్‌ఓడీలు ఎన్ని రోజుల నుంచి ఇక్కడ పని చేస్తున్న వారి వివరాలను మంత్రికి తెలియ జేశారు. ఇక తమ బదిలీలు జరుగుతాయనే చర్చ జరుగుతున్నది. మూడేండ్లు ఇక్కడే పనిచేస్తున్న అధికారుల డేటాను సైతం అడిగినట్లు సమాచారం. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పలు కీలక శాఖల అధికారుల బదిలీకి రంగం సిద్ధమవుతున్నది. రెండు రోజుల కిందట మంత్రి కాన్వాయ్ వస్తే ట్రాఫిక్‌ను ఆపలేదు అంటూ కొంత మంది అధికార పార్టీ నేతలు సదరు పోలీస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మా ప్రభుత్వం మేం చెప్పింది చేయాలే తప్పా మరోటి ఇక్కడ చేయవద్దు అంటూ తమ ఆక్రోశాన్ని సైతం సంబంధిత పోలీస్ అధికారులపై వెళ్లగక్కారు.

## అధికారుల బదిలీలపై జోరుగా చర్చలు

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో జిల్లాలోని ప్రధానమైన శాఖల్లో బదిలీలపై చర్చ జోరుగా కొనసాగుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో గత ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసిన అధికారుల బదిలీలు తప్పవనే చర్చ ఉంది. ఎలాగు ఈ ప్రభుత్వం తమను ఏదో ఒక్క చోటికి బదిలీ చేస్తుంది.. ఇక తమ బదిలీ ఎప్పుడు వచ్చినా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కనీసం ఇక్కడ కాకపోయినా వేరే చోట పక్క జిల్లాలోనే ఉంటే బాగుండు అని కోరుకుంటూ తమ తమ ప్రయత్నాలు చేస్తున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని అధికార యంత్రాంగం మొన్నటి శాసనసభ ఎన్నికలను ఒకటి రెండు చోట్ల మినహా అంతటా సమర్థవంతంగా ముగించారు. మొత్తంగా జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించారు. త్వరలోనే జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా అధికార యంత్రాంగంపై ఉంది. నూతన సంవత్సరంలో ఒక దాని తర్వాత ఒక ఎన్నిక వచ్చే అవకాశం ఉండడంతో ప్రస్తుతం ఉన్న జిల్లా యంత్రాంగాన్ని యథావిధిగా కొనసాగిస్తారా..? లేక బదిలీలు చేస్తారా..? అనే చర్చలు ఉద్యోగ వర్గాల్లో జోరుగా జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలోని కొన్ని ప్రధాన శాఖల అధికారుల మార్పు తప్పనిసరి ఉంటుందన్న చర్చ కూడా జరుగుతుంది. దీంతో ఆయా శాఖల అధికారులు తమ బదిలీ విషయంలో అధికార పార్టీ ముఖ్యనేతల ద్వారా అమాత్యుల వద్ద పైరవీలు చేసుకుంటున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు తమకు అనుకూలంగా ఉండే జిల్లాలో కీలకమైన ప్రధాన శాఖల అధికారులను తెచ్చుకునేందుకు అప్పుడే తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఏండ్ల తరబడి ఒకే చోట పనిచేసిన అధికార యంత్రాంగాన్ని ఆ స్థానాల నుంచి బదిలీ చేయాలని అధికార పార్టీ నాయకులు మంత్రుల దృష్టికి తీసుకుపోతున్నారు.

---

# ఇంద్రేశాన్ని ఆదర్శ గ్రామంగా మారుస్తా



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 19: ఇంద్రేశం గ్రామాన్ని అభివృద్ధికి మారుపేరుగా, మారుస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంద్రేశం గ్రామం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. కొత్త కాలనీలు అనేకం వస్తుండడంతో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాల్సి వస్తున్నదన్నారు. నిధులకు కొరత లేకుండా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. పీఎన్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచ్ నర్సింహులు, డీసీసీబీ డైరెక్టర్ రాఘవేందర్‌రెడ్డి, శివారెడ్డి, బండి శంకర్, మాణిక్ రెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇక్రిశాట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు, డిసెంబర్ 19: ప్రముఖ అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం ఇక్రిశాట్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సందర్శించారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని ఇక్రిశాట్ పరిశోధన కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్ పరిశోధనలపై వారు చర్చించారు. హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యేను అరవింద్‌కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇక్రిశాట్ సంస్థ ప్రధాన కార్యాలయం, పరిశోధన క్షేత్రాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రాజు, వినోద్ పాల్గొన్నారు.



ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్‌తో కలిసి పరిశోధన కేంద్రంలో పర్యటిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

---

# అభివృద్ధికి దిక్సూచి రహదారులు

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక, డిసెంబర్19: అభివృద్ధికి దిక్సూచి రహదారులు అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. పెరుగుతున్న వాహనాల వినియోగంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులతో పాటు నూతన రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రోడ్ల స్థితిగతులు, నూతనంగా నిర్మించేందుకు రోడ్ల ప్రతిపాదనలపై ఆయన చర్చించారు. దుబ్బాక పట్టణంలో ట్రాఫిక్ సమస్య నెలకొన్నందున పట్టణానికి రింగ్ రోడ్డు నిర్మాణం చాలా అవసరమని గుర్తించారు. దుబ్బాక మండలం హబ్షీపూర్ నుంచి దుబ్బాక వరకు ఉన్న డబుల్ రోడ్డును నాలుగులేన్ల రోడ్డుగా, మిరుదొడ్డి మండలం అందె నుంచి దుబ్బాక మండలం తిమ్మాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆయన సూచించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ బాలప్రసాద్, దుబ్బాక డీఈ వెంకటేశం, దౌల్తాబాద్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

### ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డికి సన్మానం..

చేగుంట, డిసెంబర్ 19: ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలువడంతో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డితో పాటు పలువురు తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తలనీలాలు సమర్పించి మొక్కుతీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం దుబ్బాకలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించి తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేసి అభినందనలు తెలిపా రు. కార్యక్రమంలో రంగయ్యగారి రాజిరెడ్డితో పాటు రైతుబంధు జిల్లా డైరెక్టర్ చేర్యాల మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపూర్ సొసైటీ మాజీ చైర్మన్ కోమండ్ల నారాయణరెడ్డి, నాయకులు కాశబోయిన సుదర్శన్, డీ రాజు తదితరులున్నారు.



ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

---

## నేడు టీడీఎస్ నిబంధనలపై అవగాహన



సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 19: ఆదాయపు పన్ను శాఖ టీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం టీడీఎస్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ శరత్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు అందోల్, సంగారెడ్డి డివిజన్ల డీడీవోలకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జహీరాబాద్, నారాయణఖేడ్ డివిజన్ల డీడీవోలకు అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీడీఎస్, ఆదాయపు పన్ను చట్టం నిబంధనలపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమానికి అన్ని డివిజన్ల డీడీవోలు విధిగా హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

## సిద్దిపేట కలెక్టర్‌కు ఉద్యోగోన్నతి



సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 19 : సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు ఉద్యోగోన్నతి లభించింది. సెలెక్షన్ గ్రేడ్(13వ లెవెల్)గా ఐఏఎస్ అధికారిగా ఉద్యోగోన్నతి లభించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి లభించినా సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా ప్రశాంత్ జీవన్ పాటిల్ కొనసాగనున్నట్లు ఆమె ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.